సాక్షి
కామారెడ్డి
ఆదివారం | 23 | జులై | 2023



ఆధారాలతో నిరూపిస్తా..
జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది అక్రమాలను నిరూపిస్తానని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు.
- 8లో ▸



తొమ్మిదేళ్ల కల సాకరమైన వేళ..
మద్నూర్‌లో డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో స్థానికులు శనివారం పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
24.4 /23.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు కృషిచేయాలి



మద్నూర్(జుక్కల్) : ఓటర్లలో చైతన్యం నింపేందుకు కృషి చేయాలని జుక్కల్ నియోజికవర్గ రిటర్నింగ్ అధికారి, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల నిర్వహణ, ఓటర్ల మార్పులు, చేర్పులు తదితర వివరాలను ఓటర్లకు వివరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్రాంతికుమార్, రెవెన్యూ అధికారులు రాచప్ప, శేఖర్ తదితరులున్నారు.

చిరుత దాడిలో మేక మృతి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని కాటేపల్లి శివారులో మేకల మందపై చిరుత దాడి చేసింది. మేకల యజమాని గైని మైసయ్య తెలిపిన వివరాల ప్రకారం కాటేపల్లి గ్రామ శివారులోని నాగమయ్య చెరువు సమీపంలోని నల్లగుండ్ల ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం మేకల మందపై చిరుత పులి (జిట్టపులి) దాడి చేసిందన్నారు. మేకల యజమని గట్టిగా అరుస్తూ రాళ్లతో కొట్టడంతో మేకను వదిలి పారిపోయిందని, దాడిలో మేక మృతి చెందిందన్నారు. గతంలో కూడా చిరుత మందపై దాడి చేసిందని, అటవీశాఖాధికారులు స్పందించాలన్నారు.

దివ్యాంగులకు పెరిగిన ఆసరా!

- పింఛన్ రూ.4,016 కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఈనెల నుంచే అమలులోకి..



సాక్షి, కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు నెలనెలా అందించే ఆసరా పింఛన్‌ను రూ.4,016కు పెంచుతూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి దాకా నెల పింఛన్ రూ.3,016 ఉంది. ఇటీవల సీఎం కేసీఆర్ దివ్యాంగుల పింఛన్‌ను పెంచుతున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో 18,896 మంది ఫించన్లు పొందుతున్నారు. వారందరికీ ప్రయోజనం కలుగనుంది. పింఛన్ కోసం మరికొందరు వేచిచూస్తున్నారు.

3 గేట్ల ద్వారా కల్యాణి ప్రాజెక్ట్ నీటి విడుదల



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి శివారులో ఉన్న కల్యాణి ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నట్లు ప్రాజెక్ట్ ఏఈ శివప్రసాద్ తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 700 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో 3 గేట్ల ద్వారా మంజీరా నదిలోకి 600 క్యూసెక్కుల నీరు, నిజాంసాగర్ ప్రధాన కాలువకు 100 క్యూసెక్కుల నీరు మళ్లించినట్లు ఆయన తెలిపారు.

టీచర్ పోస్టులపై రేషనలైజేషన్ కత్తి!



- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు
- రేషనలైజేషన్‌లో భాగంగా తగ్గిపోనున్న ఉపాధ్యాయ ఖాళీలు
- నిరుద్యోగుల ఆశలపై నీళ్లు
- అగమ్యగోచరంగా వారి పరిస్థితి

ప్రభుత్వ పాఠశాలల్లో ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. ఏటా కొన్ని స్కూళ్లు మూతబడుతున్నాయి. విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేకపోవడం, ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు ఉండడం లేదు. దీన్ని అధిగమించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల రేషనలైజేషన్ చేపట్టేందుకు వివరాలను సేకరించింది.

సాక్షి, కామారెడ్డి : జిల్లాలో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం మూలంగా వందలాది టీచర్ పోస్టులు తగ్గిపోనున్నాయి. దీంతో ఏళ్ల తరబడిగా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల నోట్లో పచ్చివెలక్కాయపడ్డట్టేనని తెలుస్తోంది. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు 1,011 ఉండగా, వాటిలో 4,938 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు ఉన్నాయి. ఇందులో 4,014 మంది ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య 924 అవుతుంది. 317 జీవో ద్వారా నిజామాబాద్ జిల్లా నుంచి ఐదు వందల పైచిలుకు మంది జిల్లాకు రావడంతో ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య 459కు పడిపోయింది.

డీఎస్సీ కోసం ఎదురుచూపులు..

ఇప్పటికే టెట్ క్వాలిఫై అయి డీఎస్సీ కోసం ఏళ్లుగా ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగుల ఆశలపై రేషనలైజేషన్ నీళ్ల చల్లుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఉపాధ్యాయ పోస్టులు తక్కువగా ఉండి ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులకు ఖాళీల సంఖ్య మరింత తగ్గుతుందన్న విషయం మింగుడు పడని అంశమే. రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అదిగో డీఎస్సీ, ఇదిగో డీఎస్సీ అంటున్నపుడల్లా నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లకు పరుగులు తీశారు. అప్పులు చేసి కోచింగ్ తీసుకున్నారు. ఇప్పటికే టెట్ క్వాలిఫై అయిన వారు వేలల్లో ఉన్నారు. ఇంకా టెట్ రాయడానికి ఎంతో మంది రెడీగా ఉన్నారు. త్వరలో టెట్ నోటిఫికేషన్ అంటుండడంతో ఎంతోమంది రాయడానికి రెడీ అవుతున్నారు. అయితే రేషనలైజేషన్ మూలంగా ఉపాధ్యాయ పోస్టులు తగ్గిపోయి వేలాది మంది నిరుద్యోగుల ఆశలు అడియాశలయ్యే పరిస్థితి ఏర్పడింది. టెట్ నిర్వహించి ఏళ్లు గడుస్తున్నా ఉపాధ్యాయ నియామకాల కోసం డీఎస్సీ నిర్వహించలేదు. ఎన్నికల ఏడాది కావడంతో ఈ సారైనా నోటిఫికేషన్ వస్తుందనుకున్నారు. కానీ డీఎస్సీ ఏమోగానీ, రేషనలైజేషన్ ద్వారా ఉన్న పోస్టులు కూడా పోతున్నాయని తెలిసి నిరాశ చెందుతున్నారు.

సర్దుబాటు చేస్తే..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులను రేషనలైజేషన్ ద్వారా సర్దుబాటు చేస్తే ఉపాధ్యాయుల ఖాళీల సంఖ్య మరింత తగ్గిపోనుంది. ఇప్పటికే 317 జీవో ద్వారా జిల్లాకు అదనంగా ఉపాధ్యాయులను కేటాయించడంతో టీచర్ పోస్టులు తగ్గిపోయి నిరుద్యోగులకు తీరని నష్టం జరిగింది. తాజాగా రేషనలైజేషన్ ప్రక్రియ ద్వారా టీచర్ పోస్టులు మరింతగా తగ్గిపోనున్నాయి. జిల్లాలో విద్యార్థు లు, ఉపాధ్యాయుల రేషియోకు అనుగుణంగా టీచర్ పోస్టులను సర్దుబాటు చేస్తే ఖాళీ పోస్టుల సంఖ్య కేవలం 125 మాత్రమేనని విద్యాశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన సమావేశంలో రేషనలైజేషన్‌కు సంబంధించిన ప్రక్రియ గురించి జిల్లా అధికారులతో వివరాలు తీసుకున్నారు. అందులో కామారెడ్డి జిల్లాలో కేవలం 125 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి స్కూళ్లు మూతబడుతున్నాయి. రెండుమూడేళ్ల కాలంలో 38 స్కూళ్లు మూసేశారు. మరికొన్ని స్కూళ్లు మూతబడే పరిస్థితి ఉంది.

నేడు పట్టణంలో మెగా జాబ్ మేళా

- 'గంప' చొరవతో కార్యక్రమం నిర్వహణ

సాక్షి, కామారెడ్డి : నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చొరవతో ఆదివారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది. కాగా వివిధ రంగాలకు సంబంధించిన 60 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయి. వెయ్యి మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులు, ఫార్మసీ, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సులు పూర్తి చేసిన వారి కి అవకాశాలు ఉంటాయన్నారు. ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. వేలమంది యువత హాజరయ్యే అవకాశముంది.

కామారెడ్డి జిల్లాలోనూ బ్లాక్ మెయిల్

- సైబరాబాద్ పోలీసులకు చిక్కిన నకిలీ ఏసీబీ అధికారి

సాక్షి, కామారెడ్డి : ఏసీబీ పేరుతో జిల్లా స్థాయి అధికారులకు ఫోన్లు చేస్తూ బ్లాక్ మెయిల్‌కు పాల్పడిన వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఏసీబీ పేరుతో జిల్లా స్థాయి అధికారులకు ఫోన్లు చేసి ఏసీబీ దాడులు జరుగుతాయని, ఎంతకో కొంతకు సెటిల్ చేసుకోమని చెబుతూ కొన్ని చోట్ల వసూళ్లకు పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లాలో కూడా ఆరుగురు అధికారులకు సదరు వ్యక్తి ఏసీబీ అధికారినంటూ ఫోన్లు చేసిన విషయం తెలిసిందే. గడచిన నాలుగైదు నెలలుగా సిద్దిపేట, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో అధికారులకు ఫోన్లు చేసి వసూళ్లకు పాల్పడినట్టు కేసులు నమోదయ్యాయి. కామారెడ్డిలో ఆరుగురు అధికారులకు ఫోన్లు వచ్చినప్పటికీ ఎవరూ సదరు వ్యక్తి ట్రాప్‌లో పడలేదు. తమకు వచ్చిన ఫోన్ కాల్స్ గురించి జిల్లా ఎస్పీని కలిసి వివరించారు. దీంతో మన దగ్గర కేసులు నమోదు కాలేదు. అయితే వివిధ జిల్లాల్లో అధికారులను ఏసీబీ పేరుతో బ్లాక్ మెయిల్‌కు పాల్పడిన వ్యక్తి అనంతపురం జిల్లాకు చెందిన జయక్రిష్ణను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేయడంతో కథ సుఖాంతమైంది. కాగా సదరు నిందితుడు అనేక నేరాలకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలినట్టు సమాచారం.

'పోచారం' నీటి విడుదల



పోచారం ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్, కలెక్టర్ జితేష్ వి పాటిల్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్ నుంచి శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ప్రధానకాలువలోకి నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది పోచారం ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండడంతో ఆయకట్టు పరిధిలో సాగు నిమిత్తం ప్రాజెక్ట్ నుంచి ఆయన నీటిని విడుదల చేశారు. ఇరిగేషన్ సిబ్బంది, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ప్రాజెక్టను పరిశీలించారు.

ట్రాక్టర్‌పై ప్రయాణం..

ప్రాజెక్ట్ వద్దకు వెళ్లే దారి బురదగా మారి కార్లు వెళ్లలేని పరిస్థితిలో ఎమ్మెల్యే సురేందర్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ట్రాక్టర్‌లో ప్రాజెక్ట్ వద్దకు చేరుకున్నారు. ఎల్లారెడ్డి డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ నారాయణ, పోచారం సర్పంచ్ విజిత, ఎంపీటీసీ వినీత, సీఈ శ్రీనివాస్, ఎస్ఈ విద్యావతి, ఈఈ మల్లేష్, డీఈఈ వెంకటేశ్వర్లు ప్రజాప్రతినిధులు తదితరులుపాల్గొన్నారు.

శిఖం భూముల పరిశీలన

నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్ శిఖంభూములను శనివారం ఎమ్మెల్యే సురేందర్, జిల్లాకలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. గ్రామశివారులోని సర్వే నం.268, 269, 38, 39లో భూములను వారు పరిశీలించారు. సర్వే నం.38, 39లో ఉన్న అసలైన అసైన్‌దారులకు సంబంధించిన భూములకు పట్టాలిచ్చేందుకు ప్రయత్నిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రాజెక్ట్ శిఖంభూములకు పట్టాలివ్వలేమన్నారు. తహశీల్దార్ సయ్యద్ అహ్మద్ మస్రూర్‌తోపాటు మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీసర్పంచ్ నర్సాగౌడ్ తదితరులున్నారు.


సింగితంకు జలకళ



అలుగుపై నుంచి పారుతున్న వరద

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్ ఆయకట్టు వరద మళ్లింపు పథకమైన సింగితం రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో వరద పోటెత్తుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి 416.5 మీటర్ల సామర్థ్యానికి చేరుకుంది. రిజర్వాయర్‌లోకి 916 క్యూసెక్కుల మేర వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండటంతో అలుగుపై నుంచి నీరు పొర్లుతుంది.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్‌కు శనివారం కూడా వరదనీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతోంది. శుక్రవారం ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండడంతో ఇన్‌ఫ్లోగా వచ్చిన వరదనీరు అలుగు దూకి మంజీర ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వెళ్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్ట్‌లోకి 6,033 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా 100 క్యూసెక్కుల నీరు ప్రధానకాలువ ద్వారా దిగువకు ప్రవహిస్తుంది. 5,933 క్యూసెక్కుల నీరు అలుగు దూకి దిగువకు ప్రవహిస్తుంది.

బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ ప్రకాశ్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి డీఎస్పీగా నియమితులైన ఆర్ ప్రకాష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన సురేష్ బదిలీపై తొర్రూర్‌కు వెళ్లారు.

తొమ్మిదేళ్ల కల సాకరమైన వేళ..

- మద్నూర్‌లో డిగ్రీ కళాశాల మంజూరుతో విద్యార్థుల్లో ఆనందం
- డిగ్రీ కళాశాల కోసం వరుస కథనాలు ప్రచురించిన 'సాక్షి'
- విద్యార్థులకు తప్పిన దూరభారం
- ఎమ్మెల్యే హన్మంత్‌సింధే కృషి



మద్నూర్‌లో కళాశాల ఏర్పాటుతో పటాకులు కాలుస్తున్న నాయకులు గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): సుమారుగా తొమ్మిదేళ్లుగా మద్నూర్ గ్రామస్తులు, యువకులు డిగ్రీ కళాశాల కోసం చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. విద్యార్థి సంఘాలు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు డిగ్రీ కళాశాల కోసం ఆందోళనలు, ధర్నాలు, ర్యాలీ తీసి డిగ్రీ కళాశాల అవశ్యకతను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో మద్నూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం మద్నూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఈ విద్యా సంవత్సరమే తరగతులు ప్రారంభించాలని జీవో విడుదల కావడంతో ప్రతిఒక్కరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఇక్కడి విద్యార్థులు 2014లోనే ఉద్యమం చేపట్టారు. మద్నూర్‌లో ఇంటర్‌తో కొందరు విద్యార్థులు చదివి డిగ్రీ చదవలేకపోయారు. డిగ్రీ చేయాలంటే బిచ్కుంద, బాన్సువాడకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. వ్యవప్రయాలకోర్చి 45 కి.మీ దూరం వెళ్లలేక చాలా మంది విద్యార్థులు ఇంటర్‌తోనే చదువులు మానేశారు. 'సాక్షి'లో సైతం డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రత్యేక కథనాలు ప్రచురించింది. ఆలస్యమైనప్పటికి డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో మద్నూర్, డోంగ్లీ ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు.

విద్యార్థులు కోసమే..



మద్నూర్, డోంగ్లి మండలాల విద్యార్థులు ఇంటర్‌తోనే చదువులు మానేయకూడదని డిగ్రీ కళాశాల కోసం సీఎం దృష్టికి తీసుకెళ్లాను. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేసింది. మద్నూర్, డోంగ్లి మండలాలోని డిగ్రీ చదవాలనుకే విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక నుంచి మద్నూర్‌లోని డిగ్రీ కళాశాలలోనే అడ్మిషన్లు తీసుకోవాలి.

- హన్మంత్‌సింధే, ఎమ్మెల్యే

చాలా సంతోషంగా ఉంది



మద్నూర్‌లో డిగ్రీ కళాశాల మంజూరైందని తెలిసిన వెంటనే చాలా సంతోషం వేసింది. ఎందుకంటే డిగ్రీ కోసం ఇక్కడి పిల్లలు బిచ్కుంద, బాన్సువాడకు వెళ్లేవారు. ఇప్పుడు మద్నూర్‌లోనే డిగ్రీ చదువుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే హన్మంత్‌సిందేకు కృతజ్ఞతలు.

- రమణ, మద్నూర్

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



డిగ్రీ కళాశాల కోసం తొమ్మిదేళ్లుగా వేచి చూస్తున్నాం. చాలా మంది ఆడపిల్లలు ఇంటర్‌తోనే చదువు ఆపేసేశారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలకు, ఎమ్మెల్యే సింధే సార్‌కి చాలాసార్లు విన్నవించాం. సార్ కూడా డిగ్రీ కళాశాల మంజూరు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సాధించారు.

- గంగారం, మద్నూర్

క్లుప్తంగా

ప్రతిభకు పట్టం కట్టారు..



కామారెడ్డి అర్బన్: ప్రముఖ రచయిత, కవి, శతావధాని అయాచితం నటేశ్వరశర్మకు ప్రభుత్వం శనివారం హైదరాబాద్‌లో దాశరథి పురస్కారం అందించి సత్కరించింది. రచనలకు సరైన గుర్తింపునిచ్చింది. నటేశ్వరశర్మ తొలి గేయసంపుటి 'వసంతకుమారి'(1981). ఖండకావ్యాలలో సమయవిలాసిని, పంచశరీయం, సౌదామినీ విలాసం, చుక్కలు, చైత్రరథం, ఆటవెలది, జీవనయానం విశిష్ట రచనలుగా పేరుకెక్కాయి. కామారెడ్డికి చెందిన ఆయన శనివారం సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన దాశరథి జయంతి ఉత్సవంలో దాశరథి కృష్ణమాచార్య పురస్కారం, ప్రశంసాపత్రం, జ్ఞాపికను రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రమణచారి, గోరేటి వెంకన్న, రసమయి బాలకిషన్, అయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'సాగర్'కు జలకళ



నిజాంసాగర్(జుక్కల్): లక్షన్నర ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందిస్తున్న నిజాంసాగర్ ప్రాజెక్ట్ జులై నెలలో జలకళను సంతరించుకుంది. వరుసగా రెండేళ్ల నుంచి జులై నెలలో నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారడం రికార్డు. కర్ణాటక, మహరాష్ట్రలో వర్షాలు కురిస్తే తప్ప మంజీరా నది వరద నీరు దరిచేరేది కాదు. గత దశబ్దాల కాలం నుంచి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటుంది. కాని గతేడాది నుంచి జులై నెల 22న నిజాంసాగర్ ప్రాజెక్టు 14 టీఎంసీల నీటిమట్టానికి చేరుకోగా ఈసారి 10 టీఎంసీల నీటిమట్టానికి చేరుకుంది. మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు నిజాంసాగర్ ప్రాజెక్టును నిండుకుండను చేస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో ఉన్న ఘనపురం ఆనకట్ట, హల్దీవాగు, పోచారం ప్రాజెక్టు అలుగు దూకుతుండటంతో మంజీరా నది వరద నీటి ప్రవాహంతో నిజాంసాగర్ ప్రాజెక్టు జళకళను సంతరించుకుంటుంది. వారం కిందట మూడు టీఎంసీల నీరు నిల్వ ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుతం 10 టీఎంసీల నీరు చేరింది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు 17.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 1398.87 అడుగులు 10.181 టీఎంసీల నీరు చేరింది. ఎగువ నుంచి 21,200 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోంది. అయితే గతేడాది జులై 22న నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 70వేల క్యూసెక్కుల మేర వరద నీరు ఇన్‌ఫ్లోగా వచ్చింది. దాంతో గతేడాది జులై 23న నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ను ఎత్తివేసి వరద నీటిని మంజీరా నదిలోకి విడుదల చేశారు.



అలుగు పారుతున్న కామారెడ్డి పెద్ద చెరువు

అలుగెత్తిన పెద్ద చెరువు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పెద్ద చెరువుకు జలకళ వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి దిగువకు నీరు చేరుకుని నిండుకుండలా చెరువు నిండుకుంది. నిండుకోవడమే కాకుండా అలుగు కూడా పొంగిపొర్లుతోంది. చెరువు అందాలను చూసేందుకు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రం నుంచి అలుగుపారుతోంది. శనివారం నుంచి పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కన ప్రజలు చెరువు వద్దకు వచ్చి సెల్ఫీలు, ఫొటోలతో చెరువు వద్ద గడుపుతున్నారు.

పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలి

నిజాంసాగర్(జుక్కల్): బూత్‌ల వారిగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ మను చౌదరి అన్నారు. శనివారం సాయంత్రం నిజాంసాగర్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంప్ ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ నారాయణ, గిర్దావర్ భాను తదితరులు ఉన్నారు.



నిజాంసాగర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మను చౌదరి

పోలింగ్ బూత్‌లో అన్ని వసతులుండాలి

బిచ్కుంద(జుక్కల్): పోలింగ్ బూత్‌లలో అన్ని వసతులు సమకూర్చాలని అడిషనల్ కలెక్టర్ మను చౌదరి అన్నారు. ఆయన శనివారం కందర్‌పల్లిలో పోలింగ్ బూత్‌ను సందర్శించారు. మండలంలో పోలింగ్ బూత్‌లలో సమస్యలపై ఇన్‌చార్జి తహసీల్దార్ భరత్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి బూత్‌లో వికలాంగులు, వృద్ధులు నడవడానికి అనుకూలంగా ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కరెంట్‌వసతి, నీటి వసతి ఉండాలన్నారు. మండలంలోని 42 మంది బీఎల్‌వోలకు ఎన్నికలపై శిక్షణ ఇవ్వాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. ఆర్ఐ సాయిబాబా, సర్పంచ్ గంగారాం ఉన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

గాంధారి(ఎల్లారెడ్డి): వానా కాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సతీష్, ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డితో కలిసి పంచాయితీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. గ్రామాల్లో మురికి కాలువల్లో నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వీధుల్లో చెత్త నిల్వ ఉండకుండా ఎత్తివేయాలని సూచించారు. ఇళ్ల చుట్టూ ఖాళీ డబ్బాలు, డ్రమ్ములు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించాలని డీఎల్పీవో సూచించారు.



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్

జిల్లాకేంద్రాల్లో దొంగల బీభత్సం

- పలు దుకాణాల్లో వరుస చోరీలు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో శనివారం వేకువజామున దొంగలు బీభత్సం సృష్టించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలోని పలు దుకాణాల్లో గుర్తు తెలియని దుండగులు వరుస చోరీలకు పాల్పడ్డారు. వివరాలు ఇలా.. ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి వద్ద ఉన్న సాయి శ్రీనివాస మెడికల్ షాప్ షట్టర్ తాళాలను దుండగులు పగలగొట్టి లోనికి ప్రవేశించి, రూ. లక్ష పదివేలను దోచుకున్నారు. సమీపంలోని రుచి చికెన్ సెంటర్ తాళాలను కూడా పగలగొట్టి రూ.10వేలు ఎత్తుకెళ్లారు. అలాగే కొద్ది దూరంలో ఉన్న వినీలా చికెన్ సెంటర్ తాళాలు పగలగొట్టి, రూ. 18వేలు చోరీ చేశారు. ఆయా దుకాణాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను సైతం ఎత్తుకెళ్లారు. ఉదయం చోరీలను గుర్తించిన దుకాణ యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాలను పరిశీలించిన పోలీసులు ఆధారాలు సేకరించారు. ఇతర దుకాణాల సీసీ కెమెరాలను పరిశీలించగా, ఇద్దరు లేదా ముగ్గురు సభ్యుల ముఠా ఈ చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. జిల్లాలకు గాని ఇతర రాష్ట్రాలకు చెందిన దొంగల ముఠా చోరీలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.



సీసీ కెమెరాలో దుండగుడు

కారు బోల్తాపడటంతో నలుగురికి గాయాలు



పంటపొలాల్లో బోల్తాపడిన కారు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామ సమీపంలో శనివారం ఓ కారు పంటపొలాల్లోకి వేగంగా దూసుకువెళ్లి బోల్తా పడింది. ఈప్రమాదంలో గోర్గల్ గ్రామానికి చెందిన అజ్జం సాయిలు, నగేష్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. కారును డ్రైవర్ అతీవేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కోతుల దాడిలో ఒకరికి..



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్‌నగర్ బస్టాండ్ వద్ద శనివారం సాయంత్రం కోతులు మూకుమ్మడిగా దాడి చేయడంతో గ్రామానికి చెందిన గంగా రాం అనే వ్యక్తి గాయపడ్డా డు. బస్టాండ్ ప్రాంతం నుంచి దుకాణానికి వెళ్తుండగా గంగారాంపై కోతులు దాడి చేయడంతో అతడి చేతివేళ్లకు గాయాలు అయ్యాయి. స్థానికులు అతడిని ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఓ యువ రైతు పొలంలో కేజీవీల్ ట్రాక్టర్ నడిపిస్తుండగా ప్రమాదవశాత్తు కేజ్‌వీల్ కింద పడటంతో తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన గుర్రపు రాజు(28) ఈ నెల 19న తన సొంత ట్రాక్టర్‌తో వేరే రైతు పొలంలో కేజ్‌వీల్ నడపడానికి వెళ్లాడు. పొలంలో అతడు కాలుజారీ పడిపోగా పైనుంచి కేజ్‌వీల్ పోవడంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. వెంటనే క్షతగాత్రుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఖర్చు భరించలేక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ప్రియాంక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తోట రాజేశ్ తెలిపారు.

కామారెడ్డిలో ఒకరు..

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మారేలి విజయ్(52) కిరాణ దుకాణం నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం రామారెడ్డి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన ఓ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధారాలతో వైద్యుల అక్రమాలు నిరూపిస్తా



మాట్లాడుతున్న కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలతో పేదలకు వైద్యం అందడం లేదని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం బీజేపీ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఏళ్లనాటి ఇరుకు భవనంలో జిల్లా ఆసుపత్రితో పాటు, మెడికల్ కళాశాల, ఇతర ఎన్నో విభాగాలు ఏర్పాటు చేసి రోగులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఓ సీనియర్ అసిస్టెంట్, కొందరు వైద్యులు, ప్రైవేట్ వ్యాపారం, అక్రమాలు మానుకోవాలన్నారు. తనవద్ద అన్ని అధారాలున్నాయని వారు సరిగ్గా వైద్యం అందించకపోతే తానే స్వయంగా వచ్చి ఆధారాలతో బయట పెడతానన్నారు. తక్షణమే మెడికల్ టీచింగ్ కళాశాల, 100 పడకలను పాత కలెక్టరేట్ భవనానికి తరలించాలన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు, ఏరియా ఆసుపత్రుల్లో ఇప్పటివరకు ఆసుపత్రుల అభివృద్ధి సొసైటీ(హెచ్‌డీఎస్) సమావేశాలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. హెచ్‌డీఎస్‌కు కన్వీనర్‌గా జెడ్పీ చైర్‌పర్సన్, కో-కన్వీనర్ కలెక్టర్, సభ్యులుగా ఎంపీ, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, డీసీహెచ్ఎస్, వైద్యాధికారులు ఉంటారని అసలు జిల్లాలో కమిటీలున్నట్లు వాళ్లకైనా తెలుసానంటూ ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రేకుల షెడ్‌లో మెడికల్ కళాశాలతో ఆస్పత్రి భవనాన్ని మరింత ఇరుకుగా చేశారన్నారు. పార్కింగ్, తాగునీటి వసతి లేదని, వైద్యులకు సిబ్బందికి బాత్‌రూంలు లేక బయట డబ్బులిచ్చి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారన్నారు. రాత్రుల్లో ఆస్పత్రిలో స్పెషలిస్ట్ వైద్యులుండటంలేదన్నారు. ఇన్‌పెషెంట్‌లకు సరైనా భోజనం లేదన్నారు. గర్భిణులకు వైద్యం అందించకుండా ప్రైవేట్‌లకు, ఇతర జిల్లాలకు రిఫర్ చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు మోటూరి శ్రీకాంత్, పండ్ల ప్రవీన్, రవి, నరేందర్, శ్రీనివాస్, నాయకులు విపుల్, సురేష్, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఎన్నికల్లో యాదవులకు తగిన సీట్లు ఇవ్వాలి

- యాదవ విద్యావంతుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ యాదవ్

కామారెడ్డి టౌన్: యాదవ ఉపకులాలకు అన్ని రాజకీయ పార్టీలు తగిన సీట్లు ఇవ్వాలని యాదవ విద్యావంతుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జన గణనలో కుల గణన వెంటనే చేపట్టాలన్నారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రాష్ట్ర బడ్జెట్‌లో 18 శాతం నిధులు కేటాయించాలన్నారు. ఆగష్టు 13న హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడీయంలో జరగబోయే యాదవ యుద్ధబేరి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. యాదవ విద్యావంతుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా జక్కుల శ్రీనివాస్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేతలు అర్కల ప్రభాకర్ యాదవ్, కుంబాల రవియాదవ్, శ్రీనివాస్‌యాదవ్, భూమేష్‌యాదవ్, తదితరులున్నారు.







చేపలు పడుతూ..మక్కబుట్ట తింటూ..

- స్పీకర్ పోచారం కాలక్షేపం..

బాన్సువాడ : బాన్సువాడలోని కల్కి చెరువు వద్ద స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు శనివారం కాసేపు సరదాగా సేదతీరారు. ప్రత్యేక వాహనంలో స్పీకర్ తన సతీమణి పుష్పతో కలిసి కల్కి చెరువు కట్టపైకి వెళ్లారు. అక్కడ మక్కబుట్టలు తింటూ చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. చెరువులో గాలాలతో చేపలు పట్టారు. నూతనంగా నిర్మిస్తున్న మల్టీ జనరేషన్ పార్కును సందర్శించారు. పార్క్‌లో కూర్చొని సతీమణితో ముచ్చటించారు.

క్రైం కార్నర్

వియ్యంకుడే హంతకుడు!

- నగల కోసమే అక్కాచెల్లెళ్లను హతమార్చిన వైనం
- మూడు రోజుల్లో కేసును చేధించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో నాలుగు రోజుల క్రితం జరిగిన అక్కాచెల్లెళ్ల హత్య కేసును పోలీసులు మూడు రోజుల్లో చేధించారు. నగల కోసమే వియ్యంకుడు వారిని హతమార్చాడు. ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన బండ నడిపి గంగాధర్ తన కుమార్తెను ఆర్మూర్‌లోని జిరాయత్ నగర్‌కు చెందిన మగ్గిడి తోట గంగవ్వ(గంగు) (58) చిన్న కుమారుడు మహిపాల్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. కాగా గంగవ్వతో పాటు ఆమె అక్క మగ్గిడి మంద రాజవ్వ (రాజుబాయి) (72) జిరాయత్‌నగర్‌లోని ఒకే ఇంట్లో కొన్ని సంవత్సరాలుగా నివాసముంటున్నారు. అక్కాచెల్లెళ్ల వద్ద ఉన్న బంగారు నగలను కాజేయడానికి వియ్యంకుడు గంగాధర్ పథకం వేశాడు. అందులో భాగంగా ఈ నెల 18న నిందితుడు తన సొంతూరు చేపూర్ నుంచి కామారెడ్డి జిల్లా గాంధారిలోని బంధువుల ఇంటికి వెళ్లి, అక్కడ తన సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి ఆర్మూర్‌కు చేరుకున్నాడు. అనంతరం అదేరోజు రాత్రి పది గంటల సమయంలో వియ్యంకురాలు గంగవ్వ ఇంటికి చేరుకున్నాడు. మరుసటిరోజు వేకువజామున గాఢ నిద్రలో ఉన్న ఇద్దరు అక్కాచెల్లెళ్లను అతడు రోకలి బండతో మోది హతమార్చాడు. హత్యలను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ఇంట్లో ఉన్న దుస్తులకు నిప్పు అంటించి ఉదయం నగలతో వెళ్లిపోయాడు.

సీసీ పుటేజీతో చిక్కాడు..

గంగాధర్ వియ్యంకురాలి ఇంటికి చేరుకోవడం, హత్య చేసి వెళ్లిపోయే దృశ్యాలు సమీపంలో గల ఒక పాఠశాల సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలీలో విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు దోచుకున్న పదిన్నర తులాల బంగారు నగలను, హత్యకు ఉపయోగించిన రోకలిబండను స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును చేధించిన ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు, ఎస్సైలు గోపి, రాజశేఖర్, తిరుపతితో పాటు సిబ్బందిని ఇన్‌చార్జీ సీపీ రివార్డులను అందజేసి అభినందించారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న పాఠశాల కరస్పాండెంట్‌ను సన్మానించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



శ్రావణ్ కుమార్ (ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండలకేంద్రం సమీపంలోని జాతీయ రహదారి 161పై శనివారం రాత్రి ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మద్నూర్‌లోని కిరాణ దుకాణ వ్యాపారి గాండ్ల సంతోష్‌కు శ్రావణ్(22), సంపత్ ఇద్దరు కుమారులు, కూతురు శ్రావణి ఉన్నారు. వీరు ముగ్గురు బీటెక్ చదువుతున్నారు. పెద్ద కుమారుడైన శ్రావణ్ శనివారం పాన్ కార్డు కోసం బైక్‌పై మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు వెళ్లాడు. తిరిగి సొంతూరు వస్తుండగా హైవే ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నేడు కళాశాలకు వెళ్దామనుకుంటే..

శ్రావణ్ ఆంధ్ర ప్రదేశ్‌లోని వైజాగ్ గీతం యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సెలవులు ఉండటంతో ఇటీవల ఇంటికి వచ్చాడు. ఆదివారం తిరిగి కళాశాలకు వెళ్లాల్సి ఉంది. కానీ రోడ్డు ప్రమాదంలో శ్రావణ్ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. మద్నూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆస్తిలో వాటా రాదనే బెంగతో ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని వజ్జపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆస్తిలో వాటా రాదనే బెంగతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై తోట రాజేశ్ తెలిపిన వివరాలు ఇలా.. వజ్జపల్లికి చెందిన గాండ్ల లావణ్య(25) అనే వివాహిత పుట్టినిల్లు రాజంపేట మండలంలోని పెద్దాయిపల్లి. ఆమెకు అక్క, సోదరుడు ఉన్నారు. ఆమె తల్లిదండ్రులకు చెందిన నాలుగెకరాల భూమిని ముగ్గురు సమానంగా పంచుకోవాలని ఉండగా, ఆ భూమిని తన అక్క పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఆ భూమి తనకు చెందుతదో లేదోనని బెంగతో లావణ్య జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు గోవింద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు, భర్త స్వామి ఉన్నారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిపై కేసు

భిక్కనూరు: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీంరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ శనివారం తెలిపారు. భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద టోల్ ఫీజు విషయమై బీంరెడ్డి టోల్ ప్లాజా మేనేజర్ పవన్‌కుమార్‌పై దాడిచేశాడు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. శనివారం భీంరెడ్డిని తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేయగా రూ.లక్ష రూపాయాల సొంత పూచికత్తుపై బాండ్ రాయించుకుని విడుదల చేశారు.